# డ్రామా

★

[ ఎస్. ఆర్. రావు ]

●

పెరటి వరండాదగ్గర, కిట్టు, బుల్లి, పాప, మరి కొందరుపిల్లలు గుమిగూడారు. ఏఆట ఆడకుండా, అనవసర వాదనలతో కాలముపుచ్చడము కిట్టు కిష్టము లేకపోయింది. అంచేత, 'నిన్నరాత్రి దేవత చూశాం కదా! ఆ నాటకము వేద్దామురా' అని బిగ్గరగా అన్నాడు.

'దేవత చాల దుమాగా వుంటుంది వేద్దాము' అని సెకండుచేశాడింకో పిల్లకాయ.

'నేను వేణువేస్తాను' అన్నాడు కిట్టు.

'నేను సీతవేస్తాను' అంది చిట్టి.

'నేను విమల' అందింకో పాపాయి.

అంతమందీ, అన్నిరోల్సు choose చేసేసుకున్నారు.

'మరి లక్ష్మి యెవరువేస్తారు' అన్నాడు కిట్టు.

'పాపేమో లక్ష్మివేస్తుంది' అని పిల్లలగుంపులోంచి ఓ సజషన్.

ఒకమూలనున్న కుక్కిమంచము ఈడ్చుకొచ్చారు.

'పాపా! నువ్వు లక్ష్మిలాగ దానిమీద పడుకోవాలి! అన్నాడు కిట్టు. పాప పడుకొంటుంది. పదిగజాల దూరములో ఒక పెట్టెమీద వేణులాగ కిట్టు కూర్చున్నాడు.

'పుస్తకాలొద్దూ. మరిసినిమాలో వేణు పుస్తకాలు చదివాడు కాదూ.' అని జ్ఞాపకశక్తిగల కుఱ్ఱాడొకడన్నాడు. ఇంకో అబ్బాయివాళ్ళన్నయ్య ఆక్సుఫర్డు అట్లాసులు కిట్టుదగ్గర పడేశాడు.

'పాటెవరు పాడుతారు' అన్నాడు కిట్టు.

'బలివాడవారి అబ్బాయి పాడుతాడు' అన్నాడు బాబులు.

'నేను పాడడానికి రెడీ' అన్నాడు బలివాడ రఘు.

'ఒరే! రఘు. నువ్వు అటకెక్కిపో.' అని Direct చేశాడు బాబులు.

'అబ్బ! నే అటకెక్కనురా! పాముపుట్ట వుంటుందేమో.'

'ఫర్వాలేదు. నేనున్నానుగా.' అన్నాడు బాబులు.

రఘు అటకెక్కి—

''ఎన్నాళ్లు కొన్నాళ్ళు మనసా
కొన్నాళ్లు ఎన్నాళ్ళు మనసా
జోలల్లుపాడితే నాగులకునిద్ర
నాగస్వరమూదితే బాలలకునిద్ర
చందమామరావె జాబిల్లిరావె
ఎన్నాళ్లు కొన్నాళ్లు మనసా.

అనిపాడాడు.

కొంతమందిపిల్లలు నాటకము చూడడానికి దూరంగా తొలగిపోయి కూర్చొంటారు.




వేణులాగ కిట్టు మంచముదగ్గరకివెళ్తూండగా, 'ఈ మంచముమీద నల్లులత్తా. నే పడుక్కోలేను' అని పాప లేచిపోయింది.

'పోనీ! పాపా! అగదులో మా నాన్నగారి మంచముమీద పడుక్కో.' అన్నాడు కిట్టు. పాప ట్లాగే చేసింది. మళ్ళా నాటకమారంభం. కిట్టు పాప దగ్గరికి వెళ్ళుతున్నాడు.

పాప గభీమని లేచిపోయి 'కిట్టూ! నాగుండె మీద పుండువుంది. నువ్వేమో వేణులాగ నామీద దొర్లుతే నాపుండు చితికిపోయి నొప్పిపెడ్తుంది. అంచేతనే లక్ష్మి వెయ్యను' అంటూ పాప పారిపోయింది.

నాటకమాపడము కిట్టుకిష్టములేదు. అంచేత ఒక వుపాయమాలోచించి తక్కిన వాళ్ళతో అన్నాడు. 'ఒరేయి! మా నౌఖరీదాని కూతురు అక్కడ పడుక్కొంది. దానిని తెచ్చి మా నాన్నగారి మంచము మీద పడుక్కోబెడ్దాము. ఏమంటారు,' పిల్లలందరు. అప్పికూతురు (ఆ రేళ్ళపిల్ల లెండి)ని మోసుకొచ్చి పడుక్కోబెడ్తారు.

మళ్లా డ్రామా రెడీ.

ఇక్కడ పిల్లల డ్రామా అవుతూవుంది సాయంకాలం కిట్టునాన్నగారు ఆఫీసునుండి తన గదులోకివచ్చి ఈరాద్ధాంతాన్ని చూస్తూ విస్తుపోయారు.

దేవత డ్రామా వేస్తున్నారు కిట్టు. నిద్రపోతువున్న అప్పికూతురుకి ఊపిరాడనీకుండా చేస్తున్నాడు.

ఎలా ఉంది నాన్నా డ్రామా అన్నాడు నాన్నను చూచి, ఫలితం పదిచీవాట్లు నాల్గుదెబ్బలు! ఆ ఘట్టంతో డ్రామా ఆఖరయింది.

